ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఏదీ భద్రత

- ఏళ్లు గడిచినా కనీస వేతనాలు కరువు
- క్రమబద్ధీకరణ ఊసే లేదు

కరీంనగర్ టౌన్, జూన్ 25: విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు ఆశా, నిరాశలతో కొట్టుమిట్టాడుతున్నారు. అరకొర వేతనాలు, ఉద్యోగ భద్రతతోపాటు ఎలాంటి ప్రభుత్వ ప్రోత్సాహం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో జిల్లాలో 555 మంది కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ ఇంటర్వ్యూల ద్వారా వీరిని ఎంపిక చేసింది. 18 ఏళ్లుగా కనీస వేతనచట్టం ప్రకారంగా వేతనాలు ఇవ్వక పోయినా కూడా ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా వారికి అప్పగించిన అన్ని విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారు. వారి చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదు. గత ఏడాది ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 21 వరకు సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేశారు. అప్పటి ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి సమ్మెకాలం జీతాలు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు అక్కడి ప్రభుత్వాలు కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తున్నాయి. రాష్ట్రంలో అమలు చేయడం లేదని, సమానపనికి సమాన వేతనమివ్వాలని సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు కోరుతున్నారు.

● అమలుకు నోచుకోని సీఎం హామీ

నిరవధిక సమ్మె సందర్భంగా వరంగల్‌లో సెప్టెంబరు 12న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల సమ్మెదీక్షా శిబిరాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి, ఆనాటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సమస్యలు పరిష్కారమవుతాయని సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు భావించారు. ఏడు నెలలు దాటినా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించాలి..
- తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలి. అప్పటి వరకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలి. 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద 20 లక్షలు ఇవ్వాలి ప్రతి ఉద్యోగికి 10 లక్షల వరకు జీవిత బీమా, ఐదు లక్షల ఆరోగ్య బీమా వర్తింపజేయాలి.

విద్యార్థులు కష్టపడి చదవాలి

- జిల్లాలోని 20 పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు చేస్తాం
- టీచ్ ఫర్ చేంజ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, సినీ నటి మంచు లక్ష్మి



విద్యార్థులతో మాట్లాడుతున్న టీచ్ ఫర్ చేంజ్ సంస్థ వ్యవస్థాపకురాలు, సినీ నటి మంచు లక్ష్మి

కరీంనగర్ టౌన్, జూన్ 25: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని టీచ్ ఫర్ చేంజ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, సినీ నటి మంచు లక్ష్మి అన్నారు. నగరంలోని కోతిరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్‌లను ఆమె కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా క్రమశిక్షణతో చదివితే తాము తగిన సహాయాన్ని అందిస్తామని అన్నారు. పేద విద్యార్థులకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకున్నామని అన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చొరవ వల్లనే స్మార్ట్ క్లాస్ రూమ్స్ చేస్తున్నామని చెప్పారు. తన కూతురు చదువుకునే పాఠశాలలో ఏ యే పాఠాలు చెబుతారో స్మార్ట్ క్లాస్ రూమ్స్ ద్వారా పేద విద్యార్థులకు వాటినే ఉపాధ్యాయులు బోధిస్తారని లక్ష్మి తెలిపారు. కలెక్టర్ పమేలాసత్పతిని తాను అనునిత్యం ఫాలో అవుతు నానని, ఆమె మంచి అధి కారి అని అన్నారు. యాదాద్రిలో పనిచేసే సమయంలో అక్కడ 50 పాఠశాలలను ఎంపిక చేసుకొని స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్‌క్లాస్ రూమ్స్‌ను విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీచ్ ఫర్ చేంజ్ నటి మంచు లక్ష్మి కార్యక్రమంలో నటి మంచు లక్ష్మి స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. పేద విద్యార్థులకు లక్ష్మి చేస్తున్న చేయూత మరిచిపోలేనిదని అ న్నారు. కాసేపు కలెక్టర్ పమేలా సత్పతి, మంచులక్ష్మి విద్యార్థులతో మా ట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఈవో జనార్దన్‌రావు, కార్పొరేటర్ మర్రి భావన సతీష్, ప్లానింగ్ అధికారి అబ్దుల్ బారి, టీచ్ ఫర్ చేంజ్ సీఈవో అయూబ్, హెచ్‌ఎంలు సంపత్‌రావు, సతీష్ పాల్గొన్నారు.



కోతిరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, మంచు లక్ష్మి

విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

భగత్‌నగర్, జూన్ 25: విద్యాసంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం నగరంలోని ట్రినిటీ కళాశాలలో రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కార్పోరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి జాతీయ విద్యావిధానాన్ని తీసుకు వచ్చిందన్నారు. నీట్ పేపర్ లీక్ అవకతవకల మరువక ముందే దేశ వ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షను రద్దుచేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడడమేనన్నారు. నీట్, యూజీసీ నెట్ పరీక్షలో జరిగిన అవతవకలపై సుప్రీం కోర్టు జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాల న్నారు. బాధ్యులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయా లని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీ యింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యా ర్థులకు టీసీలు ఇవ్వకుండా ప్రైవేటు కళాశాలలు వేధిస్తున్నాయన్నారు. గడిచిన పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు, ఎన్ని ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. రాముడిని, హిందూ మతాన్ని మోదీ హైజాక్ చేశారన్నారు. చేగువేరా, భగత్‌సింగ్‌లాంటి విప్లవకారులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థి సంఘా లు ఉద్యమించాలన్నారు. ఈ సందర్భంగా ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థలోని విధానాలపై ప్రశ్నించాలన్నారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొయ్యడ సృజన్‌కుమార్, నాయకులు మంద పవన్, మహేందర్, రఘురాం, సోతుకు ప్రవీణ్, రాజు, మచ్చ రమేష్, జనార్దన్, అంజి, సంతోష్, వెంకటేష్, శరత్ పాల్గొన్నారు.

రైతు భరోసా పకడ్బందీగా అమలు చేస్తాం

- వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

తిమ్మాపూర్, జూన్ 25: రైతుల సూచనలను పరిగణనలోకి తీసుకొని వారి అభిప్రాయం మేరకు రైతు భరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన హైదారాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ రైతులు, రైతు సంఘాలు, ప్రతి నిధులు అందరితో చర్చించి రైతు భరోసాను అమలు చేస్తామన్నారు. ప్రస్తుతానికి రైతు భరోసా పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ వార్తలను రైతులు నమ్మవద్దన్నారు. అందరితో చర్చించి మంత్రి వర్గ ఉపసంఘానికి రైతు భరోసా పథకం అమలుపై నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. గ్రామాల్లో రైతులు రాత పూర్వకంగా కూడా తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. అభిప్రాయ సేకరణ వల్ల ఈసారి రైతు భరోసా కొంత అలస్యం అయ్యే అవకాశం ఉందన్నారు. ఎంత కష్టమైనా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగినప్పుడు మండలంలోని మొగిళిపాలెం గ్రామానికి చెందిన రైతు మోరపల్లి రమణారెడ్డి మాట్లాడుతూ పది ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉన్న రైతులందరికీ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అందజేయాలన్నారు. నిజమైన రైతులకు న్యాయం జరిగేలా పెట్టుబడి సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆదాయపు పన్నుతో సంబంధం లేకుండా రైతులందరికీ పెట్టుబడి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చత్రునాయక్, ఏడీఏ అంజని, తిమ్మాపూర్ తహసీల్దార్ కనకయ్య, మండల వ్యవసాయధికారి సురేందర్ పాల్గొన్నారు.

ల్యాండ్ యుటిలైజేషన్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కరీంనగర్ రూరల్, జూన్ 25: ల్యాండ్ యుటిలైజేషన్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ రూరల్ మండల పరిషత్ కార్యలయంలో భూసర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఎంఈవోలు, ఐకేపీ సీసీలతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేను నిర్వహించాలని, క్షేత్రస్థాయిలోకి వెళ్లి వ్యవ సాయ భూములకు సంబంధించిన వివరా లను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సర్వేలో బాగంగా రాష్ట్రంలోని ఐదు జిల్లా లను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా అందులో కరీంనగర్ జిల్లా కూడా ఉంద న్నారు. వ్యవసాయ భూముల్లో వ్యవసాయం చేస్తున్నారా, లేక నిర్మాణాలు ఉన్నాయా, ప్లాటింగ్ చేశారా అనే వివరాలపై సమగ్రంగా సర్వే నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కరీంనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకటి కరుణ సూచించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఆమె మహిళా శిశు సంక్షేమ, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్‌ల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడకుండా చూడాలన్నారు. అంగన్వాడీలను మరింత బలో పేతం చేయాలన్నారు. తల్లిదండ్రులను పట్టించుకోని వారు ఎవరైనా ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

నామమాత్రంగా జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



జిల్లా పరిషత్ స్థాయిసంఘం సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కనమల్ల విజయ, పాల్గొన్న జడ్పీటీసీలు, అధికారులు

కరీంనగర్ టౌన్, జూన్ 25: జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నామమాత్రంగా నిర్వహించారు. మంగళవారం జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ ఛాంబర్‌లో 1 నుంచి 7 స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఆరో స్థాయీ సంఘం చైర్‌పర్సన్ సౌజన్య హాజరు కాకపోవడంతో నిర్వహించలేదు. మిగిలిన ఆరు సంఘాల సమావేశాలు జరిగాయి. నాలుగు సంఘాలకు జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షత వహించగా, ఒక సంఘానికి జడ్పీ వైస్ చైర్మన్ పేర్యాల గోపాల్‌రావు, మరో సంఘానికి పిట్టల కరుణ అధ్యక్షతన నిర్వహించారు. స్థాయీ సంఘ సమావేశాలకు నివేదికలు, పూర్తి సమాచారంతో వచ్చిన అధికారులు నివేదికలను చదివి వెళ్లిపోయారు. సమావేశాల్లో జడ్పీ కో అప్షన్ సభ్యుడు షుక్రుద్దీన్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికారుల నిర్వాకం... ప్రజాధనం దుర్వినియోగం

24/7 మంచినీటి సరఫరా కోసం రోడ్ల తవ్వకాలు

కరీంనగర్ టౌన్, జూన్ 25: వివిధ శాఖల మధ్య సమన్వయలోపంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ఏడో డివిజన్ పరిధిలోని హౌజింగ్‌బోర్డుకాలనీని మోడల్ కాలనీగా ఎంపిక చేసి రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. కాలనీ రూపురేఖలు పూర్తిగా మారిపోవడంతో అక్కడి ఇళ్లకు, స్థలాలకు బాగా విలువ పెరిగింది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా 24/7 మంచినీటి సరఫరాకు హౌసింగ్‌బోర్డు కాలనీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఆమేరకు పనులను చేపడుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం, వీధిదీపాలు లేక ఇబ్బందులు పడ్డ ఈ కాలనీవాసులు ఇక తమ సమస్యలన్నీ తీరినట్లేనని, 24 గంటల మంచినీటి సరఫరా చేయడం హర్షం వ్యక్తం చేశారు. 24/7 మంచినీటి సరఫరా పనుల్లో భాగంగా సీసీ రోడ్లను తవ్వడం, మిషన్ భగీరథ పైపులైన్లకు అక్కడక్కడ కనెక్షన్లు ఇస్తూ కొన్ని చోట్ల కొత్తగా పైపులైన్లను వేయడం పనులను చూసి కాలనీవాసులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. స్మార్ట్‌సిటీ మోడల్ కాలనీగా ఎంపిక చేసిన సమయంలోనే 24/7 మంచినీటి సరఫరా పైపులైన్, మీటర్ల బిగింపు, ఇతరత్రా పనులు చేసి ఉంటే ఇప్పుడు రోడ్లను తవ్వాల్సిన అవసరముండేది కాదని కాలనీ వాసులు అంటున్నారు.



హౌసింగ్‌బోర్డు కాలనీలో మంచినీటి పైపులైన్ల కోసం తవ్వీన రోడ్లు

● కొత్త రోడ్లను తవ్వి.. పైపైన ప్యాచ్‌లు

కొత్తగా వేసిన రోడ్లను తవ్వి వాటిపై పైపైన ప్యాచ్‌లు చేస్తున్నారని కాలనీవాసులు విమర్శిస్తు న్నారు.రేగడి నేల కావడంతో గతంలో అనేకసార్లు రోడ్లు, పైపులైన్లు వేసినా కొద్దిరోజులకే అవి దెబ్బ తిన్నాయని, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో మందంగా వేయడంతో రోడ్లు బాగుంటాయని భావించామని, ఇలా ప్యాచ్ వర్క్ చేస్తే మళ్లీ కొన్ని రోజులకే దెబ్బతింటాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయలోపం, ప్రాజెక్టు రూపకల్పనలో ప్రణాళిక లేకపోవడంతో రోడ్లు మున్నాళ్ళ ముచ్చటగా మారుతాయని అంటున్నారు. స్మార్ట్‌సిటీ నిధులతో వేసిన రోడ్ల నిధులు, ఇప్పుడు ప్యాచ్ వర్క్‌ల కోసం వేస్తున్న నిదులు వృథా అవుతాయంటున్నారు. 24/7 నీటి సరఫరా పథకం మంచిదే కానీ ఇలా ప్రజాధనం దుర్వినియోగం చేయడం, ఇటీవల వేసిన రోడ్లను తవ్వడం, మిషన్ భగీరథ పైపులైను వృథాచేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్లను తవ్వకాలను నిలిపివేసి మిషన్ భగీరథ పైపులైన్లు ఉన్నచోట్ల వాటికి కనెక్షన్ ఇవ్వాలని, తప్పనిసరి రోడ్లు తవ్వాల్సి వస్తే స్మార్ట్‌సిటీ స్టాండర్డ్‌తో తిరిగి రోడ్డు వేయాలే తప్ప ప్యాచ్‌లు వేయవద్దని కోరుతున్నారు.

ప్రణాళిక లేకుండా చేస్తున్న పనులపై విచారణ జరిపించండి

అదనపు కలెక్టర్‌కు కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్ ఫిర్యాదు

మోడల్ కాలనీగా మారిన తమ డివిజన్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ప్రణాళికలు లేకుండా చేస్తున్న అభివృద్ధి పనులతో ప్రజాధనం దుర్వినియోగమవు తోందని ఏడో డివిజన్ కార్పొరేటర్ ఆకులపద్మ ప్రకాశ్ ఆరోపిస్తూ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయన ఈమేరకు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. 24/7 మంచినీటి సరఫరాను స్వాగతిస్తున్నామని, రోడ్లు వేసే ముందు ఈ పనులు చేసి ఉంటే బాగుండేదని, మిషన్ భగీరథకు అనుసంధానం చేయకుండా రోడ్లను తవ్వి పైపైనే మరమ్మత్తులు చేయడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని అన్నారు. అధికారుల నిర్వాకం, నిర్లక్ష్యం, సమన్వయలోపంతో హౌసింగ్‌బోర్డుకాలనీలో కోట్లరూపాయలతో వేసిన రోడ్లు దెబ్బతింటున్నాయని, వీటికి బాధ్యులైన వారిపై చర్య తీసుకొని రోడ్లు దెబ్బతినకుండా చూడాలని కోరినట్లు తెలిపారు.

కంకర వేశారు... తారు మరిచారు

● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు

శంకరపట్నం, జూన్ 25: శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామం నుంచి మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామం వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనుల్లో భాగంగా కంకర వేసి తారు మరిచారు. గ్రామాల రోడ్డును జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. రోడ్డు నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2023లో పనులు ప్రారంభించారు. మొదటి విడత నిధులతో పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. అందులో భాగంగా ఎరడపల్లి నుంచి గంగిపల్లి వరకు కంకర వేసి పనులు నిలిపివేశారు. ఈ దారి గుండా మానకొండూర్ మండలంలోని పలు గ్రామాలకు, వీణవంక మండలంలోని పలు గ్రామాలకు పదుల సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు జరుపుతుంటాయి. సంవత్సర కాలంగా కంకర రోడ్డుపై ప్రయాణించిన పలువురు వాహనదారులు వాహనాలపై నుంచి పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


కంకర వేసి వదిలివేసిన ఎరడపల్లి-గంగిపల్లి రహదారి

దళిత కాలనీలో వెలగని వీధి దీపాలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గంగాధర, జూన్ 25: గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి దళిత కాలనీలో ఇరవై రోజులుగా వీది దీపాలు వెలగడం లేదు. గ్రామాధికారికి, విద్యుత్ అధికారులకు పిర్యాధు చేసిన మాదికాంంటే మాదికాదంటు తప్పించుకుంటున్న అధికారులు. గత ఇరవై రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పిడుగు పాటడంతో దళిత కాలనీలోని వీధి దీపాలు వైర్లతో పాటు బల్బులు కిందపడ్డయి. గ్రామపంచాయతీ సిబ్బంది పది రోజులుగా తిరుగుతున్న సమస్య గుర్తించలేకపోయారు.గ్రామసిబ్బంది కేవలం వీది దీపాలు పోతే తొంర్పడం తప్ప కరెంటు సమస్య తెలువదని వాపోతున్నారు. ఇన్సులేటర్లు పలిగి లేదా వైర్లు ఎక్కడైన అల్లుకుని ఈవిధమైన సమస్య వస్తుందని గ్రామ పంచాయతీ హెల్పర్ అంటున్నారు. వారం రోజుల క్రితం ఈ సమస్యనుతెలిపిన విద్యుత్ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. దళిత కాలనీలో వీది ధీపాల కనెక్షన్ పునరుద్దరణ చేస్తే వీది దీపాలు ఎక్కడెక్కడ పోయాయో అమర్చుతామని సిబ్బంది తెలుపుతున్నారు.గత కొన్ని రోజులుగా వీధి దీపాలు లేక కుక్కల, విషపురుగుల బెడదతో కాలనీవాసులు బయటికి వెల్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వీది దీపాలు లేక దొంగల భయం పట్టుకుందని అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను గుర్తించి సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


భోజనశాలను పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, జూన్, 25: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలురుల పాఠశాల, మెట్లచిట్టాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు కల్పించిన సదుపాయాలు, విద్యబోధన, భోజనం, హాస్టల్ వసతులను, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని, హాస్టల్ సదుపాయాలు ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఉన్న విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని, క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి వసతిగృహానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించి, అక్కడ చదువుతున్న వారితో కాసేపు మాట్లాడి అవసరమైన పుస్తకాలు ఉన్నయాని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులు, నిరుద్యోగులకు, ప్రవేశ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారికి అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రంథాలయం చుట్టు పరిశుభ్రంగా ఉంచాలని, గ్రంథాలయంకు ఏమైనా అవసరాలు ఉంటే దృష్టి తీసుకరావాలని సూచించారు. ఈయన వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆరేళ్ల రాజాగౌడ్, పాలేపు రాజాగంగారం, నాయకులు ఉన్నారు.

అంగడిలో అడ్డగోలు వసూళ్లపై విచారణ ఏది..?

● రసీదు బుక్‌లపై ఆరా తీసిన కమిషనర్

జమ్మికుంట, జూన్ 25: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పశువుల అంగడిలో అడ్డగోలు వసూళ్లపై ఆంధ్రజ్యోతి అనుబందంలో కథనం ప్రచురితం అయిన విషయం తెలిసిందె. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. అంగడి ప్రారంభమై మూడు నెలలు కావస్తుంది, పూర్తి అయిన రశీద్ బుక్‌లు ఎందుకు వెనక్కి తీసుకోలేదు, పశువుల క్రయ విక్రయదారుల వద్ద గుత్తేదారు ఎంత వసూళ్లు చేస్తున్నారు, ఎప్పటికప్పుడు తనిఖీలు ఎందుకు చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మంగళవారం అంగడి ఉండటంతో మొదట విచారణ చేపట్టాలని బావించినట్లు తెలుస్తోంది. కానీ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు అంగడి వద్దకు వెళ్లేందుకు సాహసం చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అమాయకులైన క్రయ విక్రయదాలరులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన అవసరం ఉంది.



జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం

29న సదరం స్లాట్ బుక్ చేసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్ 25: జిల్లా ఆసుపత్రిలో జూలై, ఆగస్టు నెలలో నిర్వహించే సదరం శిబిరంలో పాల్గొనేందుకు ఈ నెల 29న 11.30 నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3న ఆర్థో, జూలై 9న మానసిక, 15న కంటి చూపు, 23న వినికిడి, మూగ వారికి సంబందించిన సదరం శిబిరం నిర్వహిస్తారన్నారు. ఆగస్టు 6న ఆర్థో, 13న మానసిక, 20న కంటి చూపు, 27న వినికిడి, మూగ వారికి సంబందించిన వారికి శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. సంబంధిత వైద్య పత్రాలు, మీసేవలో బుక్ చేసుకున్న రశీదుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆదార్‌కార్డు జిరాక్స్ కాపీతో సదరం శిబిరానికి హజరు కావాలని సూచించారు.

29న కొండగట్టుకు పవన్‌కళ్యాణ్

మల్యాల, జూన్ 25: ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్‌కల్యాణ్ ఈ నెల 29న కొండగట్టుకు రానున్నట్లు తెలిసింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడంతో పవన్‌కళ్యాణ్ కొండగట్టుకు వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారని ఆయన అభిమానులు పేర్కొన్నారు. గత ఏడాది జనవరి 24న పవన్ కొండగట్టులో పర్యటించి ఏపీలో ఎన్నికల ప్రచారానికి వినియోగించిన నూతన వాహనం వారాహికి పూజలు నిర్వహించారు. అటు తరువాతే ఏపీలో ప్రచారం మొదలు పెట్టడం, ఎన్నికల్లో పోటీ చేసిన వాటిలో మొత్తం గెలుపొందడంతో కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధికి వచ్చి పవన్‌కల్యాణ్ పూజలు నిర్వహిస్తారని తెలుస్తోంది. డిప్యూటీ సీఎం హోదాలో పవణ్‌కళ్యాన్ కొండగట్టుకు రానున్నట్లు సమాచారం రావడంతో పవన్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

ఆర్టీసీ బస్సు.. బొలెరో వాహనం ఢీ

● బొలెరో ప్రయాణిస్తున్న ఇద్దరి మృతి ● బస్సులోని ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలు

ధర్మారం, జూన్ 25: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద రాష్ట్ర రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం డ్రైవర్ అన్వర్ పాషా(25), మరొక వ్యక్తి అబ్బల్(55) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల డిపోకు చెందిన ఏపీ29జడ్ 2622 ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా, ఏపీ 28టిఎ8726 బొలెరో వాహనం ఎదురుగా వస్తూ ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్ అన్వర్(25), అబ్బల్(55) అనే ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వాహన డ్రైవర్‌ది హైదరాబాద్ పరిధి ముషీరాబాద్ లోని ఇందిరానగర్‌కు చెందిన వ్యక్తి. అబ్బల్ గోదావరిఖనిలోని లక్ష్మీనగర్‌కు చెందిన వ్యక్తి అని గుర్తించారు. బొలెరో వాహనంలో ఇద్దరి మృతదేహాలు ఇరుక్కుని ఉండడంతో గ్యాస్ కట్టర్‌లతో కట్ చేసి బయటకు తీయాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఉమాదేవి, ఆగవ్వ అనే మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన



ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద ఢీకొన్న బొలెరో, ఆర్టీసీ బస్సు

స్థలానికి పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై సత్యనారాయణ చేరుకుని ఘటన వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కరీంనగర్ తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

అవమానభారంతో మహిళ ఆత్మహత్య

● న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల రాస్తారోకో

హుజూరాబాద్, జూన్ 25: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మోతె అఖిల (31) అనే మహిళకు వివాహేతర సంబంధం అంటగట్టి దాడి చేయడంతో అవమానంతో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై రెండురోజుల క్రితం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మృతురాలి బంధువులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నాను విరమింపజేశారు. మృతురాలి భర్త జలేందర్ తెలిపిన ప్రకారం..ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నాగరాజు, ఆయన భార్య ఉమ, తిరుమల, రాజ్‌కుమార్‌లు తన భార్యకు అక్రమ సంబంధం అంటగట్టడంతో తన భార్య అఖిల ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు పట్టించుకోలేదన్నారు. తాము వ్యవసాయ బావులన్నీ వెతుకగా రాజిరెడ్డి బావిలో అఖిల మృతదేహం లభించిందని తెలిపారు. దీనిపై పోలీసులకు



హుజూరాబాద్‌లో ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

ఫిర్యాదు చేసినా అవమానించిన వ్యక్తులకే పోలీసులు వత్తాసు పలుకుండడంతో ధర్నా చేశామన్నారు. ఇప్పటికైనా పోలీసులు న్యాయం చేయాలన్నారు. ఈ సంఘటపై అఖిల భర్త జలేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

కోల్‌సిటీ, జూన్ 25: గోదావరిఖని గాంధీనగర్‌లో నివాసముండే బైరి సతీష్(32) అనే వ్యక్తి భార్య కాపురానికి రావడం లేదనే మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. సతీష్ ప్రైవేట్ ఉద్యోగి. 2020లో అతనికి హారి కతో వివాహం జరుగగా మూడు సంవత్సరాల కూతురు ఉంది. భార్యభర్తల మధ్య వివాదాలతో విడాకులకు కోర్టును ఆశ్రయించారు. తన భార్య తిరిగి కాపురానికి వస్తానని చెప్పి, మళ్లీ తన వద్దకు రావడం లేదనే మనస్థాపంతో ఈ నెల 2న పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బైరి సతీష్(ఫైల్)

బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించండి

● రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్‌కు గర్షకుర్తి చేనేత సంఘం నాయకుల వినతి

గంగాధర, జూన్ 25: బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించాలని గర్షకుర్తి చేనేత సంఘం నాయకులు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం గంగాధర మండలం గర్షకుర్తి చేనేత వర్తక వ్యాపార సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ చేనేత, జౌళిశాఖ కమిషనర్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల తరువాత మినీ సిరిసిల్లగా పేరున్న గర్షకుర్తిలో మరమగ్గాలు, చేనేత రంగంపై అనేక మంది కార్మిక కుటుంబాలు ఆధారపడ్డాయని కొన్ని సంవత్సరాలుగా ఉపాధి పొందుతూ జీవనం గడుపుతున్నారన్నారు. ఆరు నెలలుగా పనిలేక ఇతర పనులు చేయలేక కుటుంబాలు గడ్డుకాలం వెల్లదీస్తున్నాయన్నారు. గర్షకుర్తి చేనేత మరమగ్గాలకు బతుకమ్మ ఆర్డర్లు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గర్షకుర్తి చేనేత వర్తక వ్యాపార సంఘం అధ్యక్షుడు అలువాల విరోభ, అన్నల్ దాస్ శ్రీనివాస్, గుండ రాజేశం, వెంకటాద్రి, అలువాల తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, జూన్ 25: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరగా అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అంజన్న దర్శనం అనంతరం భక్తులు బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతా లు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఒకరి ఆత్మహత్య

కథలాపూర్, జూన్ 25: మండలంలోని సిరికొండలో మంగళవారం ఫిరదౌస్ (26) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. రాయికల్ మండల కేంద్రానికి చెందిన ఫిరదౌస్ కొన్నేళ్ల కిందట సిరికొండకు ఇల్లరికం వచ్చాడు. భార్య ఫిరదౌసీతో కొద్ది రోజులుగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. గొడవలు జరుగుతున్న క్రమంలో వారం రోజుల కిందట ఫిరదౌస్ రాయికల్ వెళ్లాడు. సిరికొండ-కోరుట్ల రహదారి మధ్యలో ఉన్న మామిడితోటలో ఫిరదౌస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి బాషామియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపినట్టు తెలిపారు. కాగా పోలీసులు తనను వేధించారని ఫిరదౌస్ తన బంధువులకు వాట్సాప్ సందేశం పంపించినట్లు ప్రచారం జరుగుతోంది.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

రాయికల్, జూన్ 25: రాయికల్ పట్టణంలో రెండు రోజుల క్రితం 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. రాయికల్ పట్టణానికి చెందిన సింగు గంగనర్సయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవిస్తుంటాడు. తన షాపునకు బాలికను పిలిచి మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపామని చెప్పారు. ఇప్పటివరకు నిందితుడు పరారీలో ఉండగా, మంగళవారం పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ వెంట ఏఎస్సై దేవేందర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసి బస్సుకు బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

పాలకుర్తి,జూన్ 25: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం అడ్డరోడ్డు వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సుకు బైకు ఢీకొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, అందుగులపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై హరీష్ కుర్మపల్లి వైపు వస్తుండగా ఢీకొన్నట్లు తెలిసింది.

విభజన హామీల అమలుకు బీజేపీ ఎంపీలు కృషి చేయాలి

భగత్‌నగర్ (కరీంనగర్), జూన్ 25: రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన సమయంలో యూపీఎ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందన్నారు. అనంతరం కేంద్రంలో ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. బయ్యారం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ లాంటి హామీలు అమలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓట్లు కొన్నిచోట్ల బీజేపీకి ట్రాన్స్‌ఫర్ అవడం వల్లనే ఆ పార్టీ అభ్యర్థులు గెలిచారన్నారు. తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రులు బండి సంజయ్‌కుమార్, కిషన్‌రెడ్డి విభజన హామీల అమలుకు కేంద్రపై ధైర్యంగా పోరాడాలన్నారు.సింగరేణిని ప్రైవేటీకరిస్తే



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

నేత కార్మికుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూన్ 25: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీకి చెందిన ముదికొండ నరేష్ (34) అనే నేత కార్మికుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఇందిరమ్మకాలనీకి చెందిన నరేష్ గతలంలో వైపని కార్మికుడిగా పనిచేశాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. పని బంద్ చేసి జులాయిగా తిరిగేవాడు. గతంలోనూ మద్యం మత్తులో చేతి నరాలను బ్లేడ్‌తో కొసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన నరేష్ ఇంట్లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నరేశ్(ఫైల్)

● మృతుడు నరేష్ కుటుంబాన్ని జిల్లా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు పడిగెల రాజు, కోడి



నరేష్ కుటుంబీకులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

అంతయ్య, ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, తాటికొండ చందు తదితరులు పరామర్శించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి శ్రీనివాస్ పరామర్శించారు. రూ. 5 వేలు, చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీగాధ షైనయ్య రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు గడ్డం మధుకర్, శ్రీరాం నరేష్, కొంపెల్లి శ్యామ్, బల్ల లక్ష్మిపతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పాత కక్షలతో హత్య

● ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు


జగిత్యాల టౌన్, జూన్ 25: పాత కక్షల నేపథ్యంలో హత్యకు పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులకు జీవిత ఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేంపేట గ్రామానికి చెందిన ధనరేకుల రాజేందర్‌కు అదే గ్రామానికి చెందిన జెల్ల రమేష్, జెల్ల మహేష్‌లకు మధ్య పాత కక్షలతో కేసులు నమోదయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఏలాగైనా రాజేందర్‌ను హత్య చేయాలని రమేష్, మహేష్‌లు 2020 మే 19న గ్రామ సమీపంలో కత్తులతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన రాజేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య హరిణి మెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రవి కుమార్, ఎస్సై సధాకర్ కేసు నమోదు చేశారు. నిందితులైన రమేష్, మహేష్‌లను కోర్టులో ప్రవేశ పెట్టారు. కోర్టు పోలీసులు రాజు నాయక్, కిరణ్ కుమార్, రంజిత్‌లు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలు అయిన రమేష్, మహేష్‌లకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. ముద్దాయిలకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గృహిణి ఆత్మహత్య

రామగిరి, జూన్ 25: రామగిరి మండలంలోని సెంటినరీకాలనీకి చెందిన వి. శ్రీలక్ష్మి(46) మంగళవారం టాయిలెట్ క్లీనర్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం టాయిలెట్ క్లీనర్ తాగి అపస్మాకర స్థితిలో ఉన్న శ్రీలక్ష్మిని కుటుంబ సభ్యులు గుర్తించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. శ్రీలక్ష్మి మృతికి గల కారణాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోరుట్ల రూరల్, జూన్ 25 : మండలంలోని పైడిమడుగు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మాదాపూర్ గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ (27) మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం సమయంలో మాదాపూర్ గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ తన ద్విచక్ర వాహనంపై పైడిమడుగు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పైడిమడుగు గ్రామ శివారులో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్నట్లు తెలిపారు. తీవ్ర గాయాల పాలైన ప్రశాంత్‌ను గ్రామస్థుల సహకారంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు బంధువులకు తెలిపారు. వెంటనే బంధవులు కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రశాంత్ తల్లి పోశాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



పత్తి ప్రశాంత్ (ఫైల్)

తొమ్మిది వాహనాలను సీజ్ చేసిన ఎంవీఐ

హుజూరాబాద్, జూన్ 25: హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపు సమీపంలో మంగళవారం ఎంవీఐ వేణు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధిక లోడ్, సరైన పత్రాలు లేకపోవడంతో తొమ్మిది వాహనాలను సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారుడు పత్రాలు లేకుండా రోడ్లపైకి రావద్దన్నారు. అధిక మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోవాలన్నారు. రోడ్డుపై డ్రైవింగ్ నిబంధన లు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

మల్యాల, జూన్ 25: మల్యాలకు చెందిన పెరుమల్ల సుమన్‌గౌడ్ అనే గీతకార్మికుడు ప్రమాదవశత్తూ తాటిచెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. తాటిచెట్టు ఎక్కి కిందకు దిగుతుండగా అదుపుతప్పడంతో కింద పడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. కాగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

డీఈఈ సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, జూన్25: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటు కళాశాలల్లో రెండు సంవత్సరాల కోర్సులైన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డిపిఎస్ఈ) మొదటి సంవత్సరములో 2024-25 విద్యా సంవత్సరంలో చేరుటకు నిర్వహించే డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైయినట్లు మండలంలోని ఎల్ఎండిలో గల డైట్ ప్రిన్సిపల్ శ్రీ రాంమొండయ్య తెలిపారు. ఈ కోర్సులో చేరుటకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలని, షెడ్యూలు కులాల, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబరు1, 2024 నాటికి 17 సంవత్సరాలు ఉండాలని, గరిష్ఠ వయో పరిమితి లేదని తెలిపారు.

ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీలోగా సమర్పించాలని గడువు తేదీ సమీపి స్తున్నందున చివరి వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష 10.7.2024న ఉంటుందని, డిఈఎల్ఈడి కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుదని, డిపిఎస్ఈ మాత్రమే ఆంగ్ల మాధ్యంలో ఉంటుందని అన్నారు. కోర్సును ఏ మాధ్యమంలో చేయాలనుకుంటే ఆ మాధ్యమంలోనే ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష రాయాలన్నారు. వివరాలకు డిఈఈసెట్-2024 వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 25: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు పది మంది రైతులు 167క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,350, కనిష్ఠ ధర రూ.6,900 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 9 మంది డీబార్

గణేశ్‌నగర్ జూన్ 25: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 9 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు.రష్మిధర్ తేజ డిగ్రీ కళాశాల, కోరుట్లలో- ఒకరు, సంగమిత్ర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, హుస్నాబాద్‌లో- ముగ్గురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో- ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూరాబాద్‌లో- ఇద్దరు, చాణక్య డిగ్రీ కళాశాల, జమ్మికుంటలో- ఒకరు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖనిలో - ఒకరు. మొత్తం 9 మంది డీబార్ అయినట్లు తెలిపారు.

6న ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జూన్ 25 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరగనున్న ఎల్ఎల్‌బి ఆరవ సెమిస్టర్ పరీక్షలు జూలై ఆరవ తేదీ నుంచి పదో తేదీ వరకు జరగనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు.

5జీ సిగ్నల్ రేడియేషన్‌పై అవగాహన ఉండాలి

● ఐఈఎస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్



ఐఈఎస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, జూన్ 25: 5జీ సిగ్నల్ రేడియేషన్‌పై ఇంజనీరింగ్ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఐఈఎస్ డైరెక్టర్ రీసర్చ్ పర్సన్ ఎ. శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో ఈఎంఎఫ్ రేడియేషన్ అవేర్‌నెస్ 5జీ, డాట్ (డీవోటీ)స్కీంల గురించి. సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఈఎస్ డైరెక్టర్ సైబర్ సెక్యూరిటీ రీసర్చ్ పర్సన్ ఎ. శ్రావణ్‌కుమార్ టెలీగ్రాం సర్వీస్ ప్రొవైడర్ జి. రాఘవరెడ్డి, వి. రాజేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. మూడేళ్లలో తెలంగాణలో దొంగతనానికి గురైన మొబైల్స్ నుంచి 40 వేల మొబైళ్లను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై 32 లక్షల ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌చౌర్యం కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 25: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన కేసులో చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కొంకటి లక్ష్మణ్‌కు కరీంనగర్ కోర్టు జైలు శిక్ష విధించిందని ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా తెలిపారు. లక్ష్మణ్ 2019లో విద్యుత్ చౌర్యానికి పాల్పడగా కోర్టు ఆదేశాలతో జరిమానా చెల్లించాడన్నారు. మళ్లీ 2021లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ విజిలెన్స్ పోలీసులు తనిఖీల్లో పట్టుబడగా కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ ఎదుట హాజరుపరచగా 52,944 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు.

నా కొడుకును నాకు అప్పగించండి

● ప్రభుత్వాన్ని వేడుకుంటున్న తండ్రి

కరీంనగర్ క్రైం, జూన్ 25: తెలంగాణకు చెందిన ఓ బాలుడు బంగ్లాదేశ్‌లో చిక్కుకుపోయాడు. తన కొడుకును తనకు అప్పగించాలని తెలంగాణకు చెందిన ఆ బాలుడి తండ్రి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. బాధితుడు 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'కి తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన తిరుపతి 2016లో ఉపాధి కోసం ముంబైకి వెళ్లి అక్కడ మీరా రోడ్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. అతనికి అక్కడే రియా అనే బంగ్లాదేశ్ అమ్మాయి పరిచయమైంది. కొంతకాలానికి వారు పెళ్లి చేసుకున్నారు. ఇద్దరికీ కూడా ఇది రెండో వివాహం. గతంలో వారు పెళ్లిళ్ల అయి విడాకులు తీసుకున్నారు. వీరి ద్దరూ రెండో పెళ్లి చేసుకున్నాక 2017లో విశాల్ అనే కుమారుడు జన్మించాడు. కొంతకాలం తర్వాత రియా మరో అబ్బాయితో ప్రేమలో పడి అతనితో వేరే కాపురం పెట్టింది. దీంతో రియాకు, తిరుపతికి విడాకులు అయ్యాయి. వీరికి పుట్టిన బాబు రియా దగ్గరే ఉన్నాడు. మూడో భర్త తమ కుమారుడిని కొడుతున్నాడని బ్లాక్‌మె యిల్ చేసి పలుసార్లు తిరుపతిని డబ్బులు అడిగింది. చివరికి బాబు తనకు వద్దంటూ తిరుపతికి ఇచ్చేసింది. బాబును తీసుకొని తిరుపతి ముంబై నుంచి తెలంగాణకు వచ్చి మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. విడాకులు తీసుకున్నప్పటికీ రియా.. తిరుపతితో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉంది. బాబును చూడాలని ఉందన రియా చెప్పడంతో నమ్మిన తిరుపతి బాబును తీసుకుని ముంబై వెళ్లాడు. అక్కడ తిరుపతిపై దాడి చేసి బాబును తీసుకుని రియా బంగ్లాదేశ్ వెళ్లింది. ముంబైలో తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. తర్వాత బంగ్లాదేశ్ నుంచి రియా బంధువులు తిరుపతికి వాట్సప్‌లో విశాల్‌ను హింసలు పెడుతూ



బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న తిరుపతి(ఫైల్)

తీసిన ఫొటోలు, వీడియోలు పంపిస్తూ డబ్బులు అడగడం ప్రారంభించారు. డబ్బులు పంపిస్తే బాబును పంపిస్తామంటున్నారు. దీంతో తిరుపతి ఇటీవల కరీంనగర్‌కు వచ్చి తన కుమారుడిని తనకు అప్పగించాలని కేంద్ర సహాయ హోంశాఖ మంత్రి బండి సంజయ్‌ని కలిసి విన్నవించాడు. మళ్లీ బండి సంజయ్‌ని కలిసేందుకు మంగళవారం తిరుపతి కరంనగర్‌కు వచ్చిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి తన గోడును వినిపించాడు.



విశాల్

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన చెక్కుల గడువు ఈ నెల 27తో తీరిపోతున్నా వాటిని పంపిణీ చేయనివ్వడం లేదని.. వాటిని పంపిణీ చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. లబ్ధిదారులకు ఇప్పటికే జారీ అయిన చెక్కులను పంపిణీ చేయకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని పిటిషనర్ తరుపు న్యాయవాది పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. చెక్కుల పంపిణీ ఎలాంటి జాప్యం లేదని.. ఒకవేళ చెక్కుల గడువు తీరిపోయినా ప్రభుత్వం మళ్లీ జారీ చేస్తుందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ నెల 27 నాటికి చెక్కుల కాలపరిమితి తీరిపోయే పక్షంలో పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఆదేశాలిస్తామని.. దీనిపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని పేర్కొంది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

అల్ఫోర్స్ విద్యార్థులకు కరాటేలో పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూన్ 25: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు కరాటే, కుంగ్‌ఫు ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. మంగళవారం పతకాలు సాధించిన విద్యార్థులు ఎ.రితిక, ఎ సిరిసహస్రలను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్9న కరీంనగర్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే, కుంగ్‌ఫు పోటీల్లో రితిక అండర్ 12 కటా విభాగంలో బంగారు పతకం, వెపన్ విభాగంలో రజత పతకం సాధించిందన్నారు. ఎ సరిసహస్ర అండర్14 విభాగంలో వెపన్ విభాగంలో కాంస్యపతకం, కటా విభాగంలో బంగారు పతకం సాధించారన్నారు.

'బిర్లా ఓపెన్‌మైండ్స్'లో ఒలింపిక్ దినోత్సవం


స్కేటింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ రూరల్, జూన్25: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలోని బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్‌లో వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలు కన్నుల పండుగగా మంగళవారం ముగిశాయి. ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ ఒలింపిక్ జ్యోతి వెలిగించి క్రీడాకారులకు అందించారు. విద్యార్థులకు స్కేటింగ్ రేస్, రిలే రేస్, లాంగ్ జంప్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ఈకార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్ జయరాం, శ్రీకాంత్, కోచ్‌లు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ



పతకాలు సాధించిన దమ్మికకాయ్ అకాడమీ క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్25: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో ఈనెల 22,23తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన దమ్మికకాయ్ షిటోరియో కరాటే అకాడమీ క్రీడాకారులు పతకాలను సాధించారు. కట, కుమిటీ విభాగాలలో పాల్గొన్న క్రీడాకారులు అండర్-14 విభాగంలో శ్రితిక్ నందన్, మని తేజ బంగారు పతకాలను మధుశ్రీ కాంస్య పతకాన్ని సాధించారని అకాడమీ చీఫ్ ఆర్ ప్రసన్న కృష్ణ తెలిపారు. కట విభాగంలో మధుశ్రీ బంగారు పతకం, యండి షహీర్ అలీ బంగారు పతకం, నిఖిల్‌చంద్ర రజత పతకాలను సాధించారని పేర్కొన్నారు. క్రీడాకారులను అకాడమీ ప్రధాన కార్యదర్శి బండారి సంతోష్, కోచ్ ఎ.వినోద్, అకాడమీ అధ్యక్షుడు ప్రసన్నకృష్ణ అభినందించారు.

పర్యావరణశాఖ మార్గదర్శకాల మేరకే ఫ్లైయాష్ తరలింపు

కరీంనగర్ అర్బన్, జూన్25: కేంద్ర పర్యావరణశాఖ మార్గదర్శకాల మేరకే ఫ్లైయాష్ తరలింపు జరుగుతున్నదని, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తే ఊరుకోమని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రామగుండం ఫ్లైయాష్ తరలింపుపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు చేస్తూ ఆయన పరువుకు భంగం కలిగిస్తున్నాడన్నారు. సమావేశంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి పొన్నం మధు, మాజీ కార్పొరేటర్ భూమయ్య పాల్గొన్నారు.

దేవుడిపై ఒట్టేసి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటు

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్


సింగాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ప్రణవ్

హుజూరాబాద్/హుజూరాబాద్ రూరల్, జూన్ 25: ఒక ఎమ్మెల్యే స్థాయిలో ఉండి దేవుడిపై ఒట్టేసి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆరోపించారు. మంగళవారం హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లో హౌస్ అరెస్టు అనంతరం కౌశిక్‌రెడ్డికి డబ్బులు ఇచ్చిన బాధితులు నేరేళ్ల మహేందర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డిలతో కలిసి ప్రణవ్ విలేకరులతో మాట్లాడారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుటుంబాన్ని అడ్డు పెట్టుకొని గెలిచిన వ్యక్తి కౌశిక్‌రెడ్డి అన్నారు. రాజకీయ ఉనికి కోసం అబద్ధపు ప్రమాణాలు చేసి నీచస్థితికి కౌశిక్‌రెడ్డి చేరుకున్నారన్నారు. మంత్రిపై ఆరోపణలు చేసినప్పుడు ఆధారాలు లేకుండా ఎలా చేస్తావని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నది నిజం కాదా అన్నారు. దిగజారుడు, బ్లాక్ మెయిల్ చేయడం కౌశిక్‌రెడ్డికి అలవాటే అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో కౌశిక్‌రెడ్డి చరిత్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి ఆరు నెలలైనా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో కె పద్మాకర్‌రెడ్డి, పి అంజనేయులు, పత్తి కృష్ణారెడ్డి, పొనగంటి మల్లయ్య, గంగాడి తిరుపతిరెడ్డి, సారంగపాణి, దేశిని కోటి, నేరేళ్ల మహేందర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, సొల్లు బాబు, శివ, బిక్షపతి పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్ వద్ద రోడ్డు వెడల్పు చేయవద్దని మైనార్టీల ఫిర్యాదు


వీణవంక ఖబ్రస్తాన్ వద్ద పోసిన కంకర

వీణవంక, జూన్25: మండల కేంద్రంలోని ఖబ్రస్తాన్ వద్ద రోడ్డు వెడల్పు చేయకుండా మరో వైపు తీయాలని పలువురు మైనార్టీలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు సాహెబ్ హుస్సేన్, రఫీలు మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గతంలోనే ఖబ్రస్తాన్‌కు చెందిన భూమి రోడ్డుకు వెళ్లిందని మరో వైపు తమ భూమి ఉందని అటువైపు వెడల్పు పెంచాలని సూచించినా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఖబ్రస్తాన్ వద్ద రోడ్డు వెడల్పు తగ్గించకుంటే మైనార్టీలు రోడ్డెక్కి నిరసనకు దిగుతామని అన్నారు.

ఉపాధ్యాయురాలిని కేటాయించాలని వినతి

సైదాపూర్, జూన్ 25: తమ స్కూల్ టీచర్‌ను తమకు కేటాయించాలంటూ నల్లానితండా గ్రామస్థులు మంగళవారం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. నల్లానితండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు బొక్కెన సునీతను గత నెల 18న గ్రామస్థుల తప్పిదం వల్ల డీఈవో సస్పెండ్ చేశారన్నారు.

ప్రజాస్వామ్యానికి చీకటి రోజు ఎమర్జెన్సీ


ముఖానికి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, జూన్ 25: భారత దేశంలో ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ చీకటి రోజని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిలు అన్నారు. మంగళవారం నగరంలోని శుభమంగళ గార్డెన్‌లో ఎమర్జెన్సీ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన యోధులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లా డుతూ దేశ ప్రజలంతా నివ్వెర పోయేలా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసిందన్నారు.

ప్రధాని హోదాలో 21 నెలల పాటు ఎమర్జెన్సీ విధించి నిరంకుశ పాలన సాగించిం దన్నారు. దేశ భక్తులను, అభ్యుదయ వాదులను ప్రజా స్వామ్య వాదులను, పత్రికల వారిని, సమాజ సేవకు లను నిరంకుశంగా జైల్లో పెట్టిందన్నారు. చీకటి రోజు లను తీసుకు వచ్చి రాజ్యాంగాన్ని కాలరాసిన కాంగ్రెస్ నేడు రాజ్యాంగం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం శుభం గార్డెన్స్ నుంచి కమాన్ చౌరస్తా వరకు నల్లబ్యాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, కొమురవెల్లి సదానందం, జోగినిపల్లి సంపత్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుకోమల అంజనేయులు, నాయకులు మేకల ప్రభాకర్‌యాదవ్, డి.శంకర్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కళ్లెం వాసుదేవరెడ్డి, మాడ వెంకట్‌రెడ్డి, సంపత్‌రావు, రంగు భాస్కరాచారి, బొంతల కళ్యాణ్ చంద్ర, దుర్శెటి సంపత్, కటకం లోకేష్, వాసాల రమేష్, ఎడమ సత్యనారా యణరెడ్డి, జానపట్ల స్వామి, ఉప్పు రామకృష్ణ, దండు కొమురయ్య, రాపర్తి విజయ, పెద్దపల్లి జితేందర్, అనూప్, ప్రవీణ్, ఉప్పరపల్లి శ్రీను, గాయత్రి, సుధా, వైష్ణవి, సునీత, గౌతమ్‌రెడ్డి, నరసింహ రావు, రతన్, జగదీశ్వరాచారి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

భగత్‌నగర్, జూన్ 25: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రకృతి ఎన్జీఓ ప్రతినిధి డాక్టర్ గాలిపల్లి నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం రేకుర్తిలోని సాన్వి జూనియర్ కళాశాల డిఫెన్స్ అకాడ మిలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువతను నిర్వీర్యం చేయడం ద్వారా అభివృద్ధి చెందే దేశాలు నాశనమవుతున్నాయన్నారు. మాదక ద్రవ్యాలు యువత జీవితా లను నాశనం చేస్తున్నాయని వాటికి దూరంగా ఉండాలన్నారు. సమాజంలో వాటికి తావు లేకుండా విద్యార్థులు కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యా లకు వ్యతిరేకంగా విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎర్రంశెట్టి మునీందర్, ప్రిన్సిపాల్ సిరిపురం ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, జూన్ 25: ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని హాస్పిటల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఆసుపత్రిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు మాట్లాడుతూ తక్షణమే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, లేదంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

నియామకం

కరీంనగర్ టౌన్, జూన్ 25: ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా మీడియా సెల్ కన్వీనర్‌గా కరీంనగర్‌కు చెందిన గాజర్ల సుధాకర్‌రెడ్డిని నియమించినట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏనుగు అంజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

కరీంనగర్ టౌన్, జూన్ 25: నగరంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమం, స్వధార్ హోమ్, బాలసదన్, శిశు గృహాలను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ వెంకటేశ్ మంగళవారం సందర్శించారు. వృద్ధులకు సరైన సదుపాయాలు కల్పించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేశ్, వృద్ధాశ్రమం, స్వధార్‌హోం, శిశు గృహ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలపై స్పందించాలి

కరీంనగర్ క్రైం, జూన్25: వృద్ధుల సమస్యలపై సంబంధిత పోలీసులు వెంటనే స్పందించాలని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ అన్నారు. వృద్ధుల సమస్యలపై కరీంనగర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు సముద్రాల జనార్ధన్‌రావు మంగళవారం టౌన్ ఏసీపీకి ఒక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదాంగడ్డలో వృద్ధుడు గొట్టెముక్కుల వెంకటాచారి(85)ను ఆయన మనుమడు వెంకటేష్ వేధిస్తున్న కేసులో ట్రిబ్యునల్ తీర్పును అమలు చేయాలని జనార్దన్‌రావు ఏసీపీకి విజ్ఞప్తి చేశారు.

మాదకద్రవ్యాల నిర్మూలన సామాజిక బాధ్యత

కరీంనగర్ టౌన్, జూన్ 25: మాదకద్రవ్యాల నిర్మూలన సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు అధికారులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ, వ్యాసరచన, చిత్రలేఖనం, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక జడ్పీ క్వార్టర్స్ డే కేర్ సెంటర్‌లో బీసీఎస్, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్స్‌కి పిల్లల్లో మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలనకు శిక్షణ కార్యక్రమం, వ్యాసరచన పోటీలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ అధికారులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరిం టెండెంట్ శ్రీనివాస్, రూరల్ సీడీపీవో సబిత, అర్బన్ సీడీపీవో లక్ష్మినారాయణ, డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, మెడికల్ డిపార్టుమెంట్ డాక్టర్స్ రంగారెడ్డి, పృథ్వీ రెడ్డి, కేశవరెడ్డి, శ్రీనివాస్, కళింగ శేఖర్, విజయ్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంగారక సంకటహర చతుర్థి పూజలు


మహాశక్తి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 25: నగరంలోని ఆలయాల్లో మంగళవారం అంగారక సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, చైతన్యపురి మహాశక్తి, జెడ్పి క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్ల, కమాన్‌రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవికన్యకాపరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి, పాతబజార్ గౌరీశంకర ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనల్లో, గణపతి హవనాల్లో భక్తులు పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ దుర్గా భవానీ ఆలయంలో అంగారక చతుర్థిని పురస్క రించుకుని లక్ష్మీ గణపతికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతులకు విశేష అభిషేకం, ఫలపంచామృత అభిషేకం, విశేష హారతి పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకులు పవనకృష్ణ శర్మ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలి

భగత్‌నగర్, జూన్ 25: సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.కోటంరాజ్ డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.కోటంరాజ్ అన్నారు. మంగళవారం నగరంలోని కోతిరాంపూర్ చౌరస్తాలో సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం నిలిపి వేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే సింగరేణిని వేలం వేస్తామని రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నదన్నారు. తెలంగాణకేచెందిన కిషన్‌రెడ్డిని బొగ్గుగనుల శాఖ మంత్రిని చేసిందన్నారు. సింగరేణి బొగ్గును ప్రైవేటుకంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గతంలో కోయగూడెం, కళ్యాణఖని, వేలం వేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించిందన్నారు. సింగరేణి బొగ్గు వేలం ద్వారా కార్మికులకు, నిరుద్యోగులకు తీవ్రంగానష్టం వాటిల్లుతుందన్నారు. వేలం పాటను విరమించుకోవాలని, సింగరేణికి వేలం లేకుండా బొగ్గు బ్లాకులను అప్పగించాలని ఆర్.కోటంరాజ్ డిమాండ్ చేశారు.

ఈకార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి, కార్యదర్శి ఎడ్ల రమేష్, యు శ్రీనివాస్, కొప్పుల శంకర్, కదిరె రమేష్, చౌదరి, సంపత్,మల్లేశం, తిరుమలయ్య, ప్రభ, స్వర్ణలత, కనుకయ్య, రాజకుమారి, వెంకన్న, శంకర్, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హౌస్ అరెస్టు

● వీణవంకలో ఉద్రిక్తత


వీణవంకలో ఎమ్మెల్యే ఇంటి వద్ద పోలీసులు

వీణవంక, జూన్ 25: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుల అవినీతి ఆరోపణల సవాళ్ల ప్రతి సవాళ్లతో వీణవంకలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హైద్రాబాద్ నుంచి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వీణవంకలో మంగళవారం తన ఇంటికి చేరుకోవడంతో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. చెల్పూరు ఆలయంలో ప్రమాణం చేసేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. బయటకు వెళ్లవద్దని పోలీసులు చెప్పడంతో చట్టాన్ని గౌరవించి ఇంటి అవరణలోనే స్నానం చేసి తడి బట్టలతో ఆంజనేయ స్వామి చిత్రపటంపై ప్రమాణం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడతూ మంత్రి పొన్నం ప్రభాకర్ తనను ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలన్నారు. నేను నా నిజాయితీ నిరుపించుకున్నా. ఫ్లైయాష్‌లో వంద కోట్ల అవినీతి జరిగిందని నేనే ఆరోపించా.. అది నిజం కాదని మంత్రి ఎందుకు నిరుపించుకోవడం లేదన్నారు. అవినీతి జరుగలేదని ప్రమాణం చేయి నేను బహిరంగ క్షమాపణ చెప్తా అని అన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు హైద్రాబాద్‌లోని వేంకటేశ్వర ఆలయంలో ఇద్దరం ప్రమాణం చేద్దామని సవా లు విసిరారు. మంత్రి నా సవాలుకు సిద్ధంగా ఉంటే ప్రభుత్వం మీది నేను ఒక్కడినే వస్తా మీరు ఒక్కరే రండి అంటూ సవాలు విసిరారు.

కాంగ్రెస్ నాయకుల భారీ ర్యాలీ


ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట, జూన్ 25: జమ్మికుంట మున్సిప ల్ పరిధిలోని కొత్తపల్లిలో ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు చెల్పూర్‌లోని శ్రీఆంజనేయ స్వామి దేవాలయం వరకు మంగళవారం భారీ ర్యాలీగా బయలుదేరారు. అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో ఎస్‌ఐ రాజేష్ వారి వాహనాలను అడ్డుకున్నారు. చెల్పూర్ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, అటువైపు వెళ్ల నిచ్చే ప్రసక్తి లేదని దురుసుగా చెప్పినట్లు తెలిసింది. దీంతో దేశిని కోటి ఎస్‌ఐ రాజేష్‌ల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరుకాల వీరేశలింగం, పొనగంటి మల్లన్న, నేరేళ్ల మహేందర్, బాలసాని రమేష్, బొంగోని వీరన్న, పొనగంటి రాము, దేశిని సదానందం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు హౌస్ అరెస్టు

మానకొండూర్, జూన్ 25 : హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆయనకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావును మానకొండూర్‌లో మంగళవారం పోలీసులు అడ్డుకొని హౌస్ అరెస్టు చేశారు. దీంతో పోలీసులతో జీవీఆర్ కొద్దిసేపు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్‌తో పాటు పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జడ్పీటీసీలు తాల్లపల్లి శేఖర్‌గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ పొన్నం అనిల్, ఊటూర్ సింగిల్‌విండో అధ్యక్షులు ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, పిట్టల మధు, మండల మాజీ అధ్యక్షులు శాతరాజు యాదగిరి పాల్గొన్నారు.

వదంతులు నమ్మవద్దు..

ఆరోగ్యంగానే ఉన్నా : ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్/మానకొండూర్, జూన్25: డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం స్వల్ప అస్వస్థతతకు గురయ్యారని, గుండెపోటుకు గురైనట్లు కొన్ని ప్రచారమాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అవాస్తమని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యుల సలహా మేరకు ఎమ్మెల్యే హైదారాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు. దానిలో భాగంగానే తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హాజరుకాకుండా వారి సతీమణి డాక్టర్ అనురాధను మేళాకు పంపించడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోగ్య విషయంలో వదంతులను ఎవరూ నమ్మవద్దని, ఒకటి రెండు రోజుల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని ప్రకటనలో తెలిపారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్


నియామక పత్రం అందిస్తున్న కలెక్టర్, కవ్వంపల్లి అనురాధ

తిమ్మాపూర్, జూన్25: జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని, చిన్న ఉద్యోగం వచ్చినా వదులుకోవద్దని తాను నాలుగు ఉద్యోగాలు మారి ఈ స్థాయికి వచ్చానని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి సాయిరాం గార్డెన్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ నిర్వహించిన మెగా జాబ్ మేళాను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి కవ్వంపల్లి అనురాధతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మెగాజాబ్ మేళాకు సుమారు 6,000 మంది హాజరయ్యారని తెలిపారు. 68కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయని ఇందులో 25కంపెనీలు స్పాట్‌లోని ఉద్యోగాలకు ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి కవ్వంపల్లి అనురాధ మాట్లాడుతూ మహిళలు ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఉద్యోగాలు సాధించిన వారికి ఆఫర్ లెటర్లను అందజేశారు. డిప్యూటీసీఈఓ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్ కనకయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి పాల్గొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను విడుదల చేయాలి

భగత్‌నగర్, జూన్ 25: పెండింగ్‌లో ఉన్న లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ లేబర్ యూనియన్ (టిఎల్‌యు) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా లేబర్ ఇన్సురెన్స్ కార్డులు దరఖాస్తు చేస్తున్న వారికి సంవత్సరాలైనా ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులకు ఇబ్బందులకు గురి చేస్తే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీవో సంఘం

సుభాష్‌నగర్, జూన్ 25: ఇటీవల బదిలీ అయిన కలెక్టర్‌ను తిరిగి కరీంనగర్ కలెక్టర్‌గా కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం టీఎన్‌జీవో సంఘం నాయకులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నరిసింహాస్వామి, గూడ ప్రభాకర్, మడిపల్లి కాళిచరణ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, హర్మిందర్‌సింగ్, కోట రామస్వామి, నరసింహరెడ్డి, సబిత, మల్కా రాజేశ్వర్‌రావు, ఒంటెల రవీందర్‌రెడ్డి, నేరేళ్ళ కిషన్, జలాలుద్దీన్ అక్బర్, కరుణాకర్, నగేష్, నాగుల అనిల్, రాజమల్లు, విజయలక్ష్మి, శైలజ, హరిప్రియ, సుస్మితసింగ్, అజయ్, నారాయణ, శ్రీను, శంకరయ్య పాల్గొన్నారు.

సదాశివరెడ్డి హఠాన్మరణం

● చింతగుట్టలో విషాదం



శంకరపట్నం, జూన్ 25: శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన కరివేద సదాశివరెడ్డి (74) మంగళవారం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హఠాన్మరణం చెందాడు. కరివేద సదాశివరెడ్డి హైబ్రిడ్ మొక్కజొన్న, వరి విత్తనాలను స్థానిక రైతులకు అందిస్తూ రైతుల ఆర్థిక ఎదుగుదలకు దోహదపడ్డాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ పలు దేవాలయా లకు విరాళాలు అందించారు. చింతగుట్ట గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించారు. ఆయన మృతి తీరణి లోటని గ్రామస్థులు కంటతడి పెట్టారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

జమ్మికుంట రూరల్, జూన్ 25: శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగ పడుతాయని మండల విద్యాధికారి విడప శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఎంపిక పోటీల సందర్భంగా మాట్లాడారు.

●ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతికి ఎంపిక పోటీలు మంగళవారం ప్రారంభించినట్లు ఎంఈవో విడప శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంగాధర : గంగాధర ప్రభుత్వ పాఠవాలలో మంగళవారం క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలను నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా సాయికి ఎంపిక చేసనట్లు ఎంఈవో వేణుకుమార్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

చొప్పదండి, జూన్25: చొప్పదండి ప్రాథమిక సహకార సంఘం సభ్యుడు మరణించగా ఆయన కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని చైర్మెన్ వెల్మ మల్లారెడ్డి అందజేశారు. గుమ్లాపూర్ గ్రామానికి చెందిన సభ్యుడు సందవేని కొంరయ్య మరణించగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి,ఎంపీటిసి లక్ష్మీనారాయణ,సీఈఓ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటం దహనం

జమ్మికుంట రూరల్, జూన్ 25: జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎన్ఎస్‌యూఐ నాయకుల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటాన్ని మంగళవారం దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీక్ జరిగి నెల రోజులు కావస్తున్న కేంద్రం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. నీట్ పరీక్ష సమర్థవంతంగా నిర్వహించని కేంద్ర విద్యాశాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు ఎండి ఇమ్రాన్, పల్నాటి అభిలాష్, వంశీ, అవినాష్, నాగరాజు, శివ, సమీర్, నరేష్, రాజేష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●సుభాష్‌నగర్: నీట్ పరీక్ష నిర్వహించడం వెనక కుట్ర దాగి ఉందని ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్స్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో చిగిరి శ్రీధర్, బోయిని పల్లి చంద్రయ్య, బాపురెడ్డి, రాంరెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పెంచాల లక్ష్మన్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఇచ్చే రాష్ట్ర స్థాయి రజనీశ్రీ సాహిత్య పురస్కారానికి 2024 సంవత్సరానికి గానుచుందూరు సీత రచించిన సారంగి నవల ఎంపికైనట్లు పురస్కార కమిటీ కన్వీనర్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, కోశాధికారి స్తంభంకాడి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

●కరీంనగర్ కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో మంగళవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని అభిషేకం అనంతరం సుదర్శన, నారసింహ, వరాహ మంత్రాల హవనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో ఈనెల 29న మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలయ పరిధిలోని 5 దుకాణాల (షెట్టర్లు) నిర్వహణకు టెండర్లకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఈఓ ఎన్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాల పరిమితి అక్టోబర్ 1వ తేదీ 2024 నుంచి సెప్టెంబరు 30, 2027 వరకు ఉంటుందని పేర్కొన్నారు.

●భగత్‌నగర్: నగరంలోని రేకుర్తి 18వ డివిజన్ కొత్తవాడ కాలనిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ 18వ డివిజన్ అధ్యక్షుడు జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

●సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావుకు కరీంనగర్‌లో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, పొనగంటి కేదారి, సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్, జూన్25: ల్యాండ్ యుటిలైజేషన్ గ్రామాల్లో సర్వే నుంచి పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో సంజీవరావుకు వినతిపత్రం అందించారు.